క్లుప్తంగా

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



ఆర్మూర్‌టౌన్: మామిడిపల్లిలో పేదలు నిర్మించుకున్న ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని న్యూడెమోక్రసీ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దాసు అన్నారు. ఈమేరకు పార్టీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు ధర్నా నిర్వహించారు. ఎన్నికల అనంతరం సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. అలాగే ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని సైతం వారు ఆశ్రయించగా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. నాయకులు సూరిబాబు, వెంకటేష్, ఆలీంబాయి, మగ్దుమ్ పటేల్, శివకుమార్, లతీఫ్, ఇర్ఫాన్, ఎం లక్ష్మి, గంగక్క, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ సభకు తరలిరావాలి



రుద్రూర్: బాన్సువాడలో ఈనెల 30న జరుగనున్న సీఎం కేసీఆర్ సభకు భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావాలని నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. రుద్రూర్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోపై నిర్వహిస్తున్న సర్వే వివరాలు తెలుసుకున్నారు. వైస్ ఎంపీపీ సాయిలు, పత్తి రాము, నర్సయ్య, అక్కపల్లి నాగేందర్, కోడె శంకర్, కిశోర్ పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు సరికావు



బోధన్: బోధన్‌లో అంబేడ్కర్ భవనం నిర్మాణం విషయంలో ఎమ్మెల్యే షకీల్‌పై మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంపల్లి ఎల్లయ్య చేసిన అసత్య ఆరోపణలు సరికావని, తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగురావు, నియోజకవర్గ నాయకుడు డీలర్ సాయిలు తెలిపారు. సాలూర మండల కేంద్రంలో శనివారం వారు మాట్లాడారు. పార్టీ మారి, ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేయడం ఆయన విజ్ఞతే వదిలేస్తున్నామని పేర్కొన్నారు. నాయకులు చంటి, బాల్‌రాజ్, లక్ష్మయ్య, చందు, సాయిలు, దత్తాత్రి, సుభాష్, మైసయ్య ఉన్నారు.

'మాలలు నీ వెంట లేరు'



బోధన్‌టౌన్(బోధన్): మాలల పేరు చెప్పుకొని పార్టీలు మారుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంపల్లి ఎల్లయ్య వెంట మాలలు లేరని మాల మహానాడు పట్టణ అధ్యక్షులు రేఖం దాసు అన్నారు. బోధన్‌లో శనివారం మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్లయ్య కాంగ్రెస్ పార్టీలో చేరి బోధన్ ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నాయకులు మొగులయ్య, స్వామి, యాదగిరి, సాయిలు, బాలకృష్ణ, శంకర్, నారాయణ, గంగారాం, సురేందర్, రాజు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల కోసమే ఎన్నికల్లో డీఎస్పీ పోటీ



మోర్తాడ్: అణగారిన వర్గాల కోసమే ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) ఎన్నికల్లో పోటీ చేస్తుందని పార్టీ బాల్కొండ నియోజకవర్గం అభ్యర్థి మంగ్లారం భోజన్న అన్నారు. మండలంలోని పాలెంలో పార్టీ ప్రచార కరపత్రాలను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నాయకులు ఉమేష్, గౌరవ్, రామ్, శంకర్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



వేల్పూర్: నవంబరు 5న హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగ యుద్ధభేరి కరపత్రాలను శనివారం వేల్పూర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయమైన వాటా కోసం ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ నాయకత్వంలో యుద్ధభేరి జరుగుతుందన్నారు. నాయకులు శ్రీనివాస్, మోహన్, దేవయ్య, రాజగంగారాం, ప్రకాష్, మల్లేష్ పాల్గొన్నారు.

మోర్తాడ్ కేంద్రంగా రేషన్ దందా

- టాస్క్‌ఫోర్స్ దాడుల్లో భారీగా పట్టుబడిన రేషన్ బియ్యం
- బియ్యంను గోదాంకు తరలించి, వాహనాలను సీజ్ చేసిన అధికారులు



రేషన్ బియ్యం రవాణా చేస్తూ గతంలో పట్టుబడిన వాహనాలు



ఇటీవల పట్టుబడిన డీసీఎం వాహనం

మోర్తాడ్(బాల్కొండ): రేషన్ బియ్యం దందాకు మోర్తాడ్ అడ్డాగా మారిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. నాలుగు రోజుల కిందట టాస్క్‌ఫోర్స్ అధికారులు ఒక గోదాంపై దాడి చేసి రవాణాకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం డీసీఎం, ఒక ట్రాలీ ఆటోలను సీజ్ చేశారు. ఈ రెండు వాహనాల్లో భారీ మొత్తంలో రేషన్ బియ్యం లభ్యమయ్యాయి. టాస్క్‌ఫోర్స్ అధికారులకు పక్కా సమాచారం అందడంతోనే బియ్యం రవాణాను అడ్డుకోవడానికి రాత్రిపూట మెరుపు దాడుల చేశారని తెలుస్తోంది. మోర్తాడ్ నుంచి మహారాష్ట్రతో పాటు మన రాష్ట్రంలోని బీరు ఫ్యాక్టరీలకు బియ్యంను రవాణా చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. రేషన్ దుకాణాల్లో వినియోగదారులు తీసుకున్న బియ్యంను చిన్న వ్యాపారులు కిలోకు రూ.14 నుంచి రూ.18వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఈ బియ్యంను బడా వ్యాపారులకు క్వింటాలుకు రూ.2వేల వరకు చిన్న వ్యాపారులు విక్రయిస్తున్నారు. చిన్న వ్యాపారుల నుంచి సేకరించిన బియ్యంను బహిరంగ మార్కెట్‌లో రూ.2,400లకు క్వింటాలు బియ్యంను అమ్ముకుంటున్నారు. మోర్తాడ్ పరిసర గ్రామాలలోను బియ్యంను సేకరించి ఇక్కడ గోదాంలలో నిలువ చేయడం, రాత్రిపూట తరలించడం జరుగుతోంది. ఇప్పటి వరకు దాదాపు 50 వాహనాల బియ్యంను మోర్తాడ్‌లో అధికారులు పట్టుకున్నారు. ఈ లెక్కన బియ్యం దందాకు మోర్తాడ్ కేరాఫ్‌గా మారిందని వెల్లడవుతుంది. పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పని చేసి బియ్యం దందాకు చెక్ పెట్టాలని పలువురు కోరుతున్నారు.

సేవ చేసి రుణం తీర్చుకుంటా



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

వర్ని: తాను రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి కమ్మ సామాజిక వర్గం తనకు మద్దతు తెలుపుతుందని, వారికి సేవ చేసి రుణం తీర్చుకుంటానని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. వర్ని మండలంలో శనివారం కమ్మ సామాజిక వర్గం ఆధ్వర్యంలో స్పీకర్‌కు మద్దతుగా కార్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో వారు ఏర్పాటు చేసిన సమ్మేళన సభలో స్పీకర్ మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కమ్మ సామాజిక వర్గానికి అండగా నిలబడ్డామన్నారు. తనపై చూపించిన ఈ అభిమానానికి కృతజ్ఞత తీర్చుకుంటానన్నారు. నెహ్రూ నగర్ గ్రామానికి చెందిన అబ్బసాని శ్రీనివాస్ అనే పోచారం అభిమాని శనివారం స్పీకర్‌కు నామినేషన్ కోసం రూ.25వేలను అందజేశారు. డీసీసీబీ జిల్లా అధ్యక్షుడు పోచారం భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి, ఎంపీపీలు మేక శ్రీలక్ష్మి వీర్రాజు, వల్లేపల్లి సునీత, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలిస్తే బీసీ సీఎం!



జీజీ నడ్కుడలో మాట్లాడుతున్న పైడి రాకేశ్ రెడ్డి

డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్రంలో బీజేపీని గెలిపిస్తే బీసీ సీఎంగా చేస్తామని, అర్హులందరికీ ఇండ్లు, స్థలాలు, రేషన్ కార్డులు, నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తామని బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని అన్నారం, సిర్పూరం, జీజీ నడ్కుడ, గాదేపల్లి, చిన్నయానం గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు, బీజేపీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రచారంలో ఆయన మాట్లాడుతూ.. జీవన్‌రెడ్డి రౌడీయిజం, అక్రమ కేసుల చిట్టా తన వద్ద ఉందని, ప్రజలు ఈసారి బీజేపీకి ఓటేసి గెలిపిస్తే, జీవన్‌రెడ్డి ఆట కట్టించి అన్ని లెక్కలు తేలుస్తానన్నారు. బానిస బతుకులు పోయి మంచి రోజులు రావాలంటే ప్రజలు నవంబర్ 30న బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. నాయకులు పోతుగంటి సురేందర్, ఎంపీటీసీ సంజీవ్, నాయకులు చిన్నారెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా గ్యారంటీ పథకాలు





బాగేపల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి.. కుర్నాపల్లిలో..

రెంజల్/ఎడపల్లి: రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత, కార్మికులు తదితర వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ 6 గ్యారంటీ పథకాలను తీసుకువస్తుందని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. రెంజల్ మండలంలోని కళ్యాపూర్, కూనేపల్లి, బాగేపల్లి, ఎడపల్లి మండలంలోని నయాబాది కాలనీ, కుర్నాపల్లి, మంగళ్‌పాడ్, గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని పార్టీ అధిష్టానం మేనిఫెస్టోను తయారు చేసిందని గుర్తు చేశారు. స్థానిక సమస్యలపై ఎమ్మెల్యే షకీల్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. వచ్చే నెలలో జరిగే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించి, అధికారంలోకి తీసుకురావాలని అన్నారు. జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఇమ్మిడి గోపి శనివారం సుదర్శన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, కేశ వేణు, పులి శ్రీనివాస్, తాహిర్ బిన్ హందాన్, ధనుంజయ్, నాగభూషణంరెడ్డి, సురేందర్‌గౌడ్, రాములు, సాయరెడ్డి, నితిన్, మోహన్, పోచయ్య, కృష్ణ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి



మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

మాక్లూర్: రాబోయే ఎన్నికల్లో తనను మరోసారి ఆశీర్వదించి, గెలిపించాలని, ఈసారి గెలిపిస్తే అంతులేని అభివృద్ధి చేసి చూపిస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గంగరమంద, వేణు కిషన్‌నగర్ తండా, వెంకటాపూర్, మెట్‌పల్లి, వల్లభాపూర్, మాందాపూర్, గ్రామాలలో జీవన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి గెలిస్తే మంత్రి పదవి రావడం ఖాయమని ఆ పదవితో ఆర్మూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసే అవకాశం తనకు లభిస్తుందని జీవన్‌రెడ్డి అన్నారు. ఆయనకు గ్రామాల్లో ప్రజలు ఘన స్వాగతం పలికారు. పలు గ్రామాల్లోని యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఎంపీపీ మాస్త ప్రభాకర్, బడుగు సత్యం, సర్పంచులు రమేష్ నాయక్, గంగాధర్, చిన్‌రెడ్డి, మంజుల సుధాకర్, సులోచన, రఘు, ఎనిగంటి శ్రీనివాస్ గౌడ్, గుగ్గిలం రాజేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.


ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం






పోతంగల్‌లో పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు.. శాటాపూర్ గేట్ వద్ద..

ఆర్మూర్‌టౌన్/రుద్రూర్/రెంజల్/ఎడపల్లి: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి శనివారం బీజేపీ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీసీ వ్యక్తిని ముఖ్యమంత్రిని చేస్తామని ఇటీవల కేంద్ర హోంమంత్రి ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. బీజేపీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం పార్టీ శ్రేణులు సంబురాలు నిర్వహించి, మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకాలు నిర్వహించారు. బీజేపీ బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యామాద్రిభాస్కర్, నాయకులు ద్యాగ ఉదయ్, జీవీ నర్సింహారెడ్డి, పుప్పాల శివరాజ్, వడ్డీ మోహన్ రెడ్డి, జెస్సుఅనిల్, బాశెట్టి రాజ్ కుమార్, ర్ నాగం సాయిలు, మక్కన్న, మారుతి, శివలింగ్, కిరణ్ సేట్, పోచయ్య, బుజ్జి, ప్రకాష్, శ్రీనివాస్, రవి, ఒడ్డెన్న, సాయిబాబ, అనీల్, యోగేష్, శ్రీధర్, ఇంద్రకరణ్, శ్రీనివాస్, సుజనా ప్రవీణ్ పాల్గొన్నారు.



రెంజల్‌లో..



ఆర్మూర్ పట్టణంలో..

రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ



కోనాపూర్‌లో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో సునీల్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ. 2లక్షల రైతు రుణమాఫీ చేస్తామని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నర్సాపూర్, ఇనాయత్ నగర్, కోనాపూర్ గ్రామాలలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ పథకాలను ప్రజలకు వివరించారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒకసారి అవకాశం ఇచ్చి, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక..

భీమ్‌గల్/మోర్తాడ్/బాల్కొండ: భీమ్‌గల్‌కు చెందిన పలువురు నాయకులు శనివారం సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే బాల్కొండ మండలంలోని వన్నెల్(బి) గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు గోజూర్ సంతోష్, పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. మోర్తాడ్ మండల బీఆర్ఎస్ మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి తక్కూరి రంజిత్, నాయకుడు దోన్‌పాల్ కిషన్‌లు కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా వారికి సునీల్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు జేజే నర్సయ్య, నాగేంద్ర, వాక మహేశ్, దేవేందర్, రాజేందర్, ఆర్మూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అవకాశమిస్తే.. అభివృద్ధి చేస్తా..



నందిపేట్(ఆర్మూర్): తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఆర్మూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని కాంగ్రెస్ అభ్యర్థి వినయ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వన్నెల్ కే, సిద్దాపూర్, కుద్వాన్‌పూర్, జోర్పూర్ గ్రామాలలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ప్రజలకు అన్ని విధాల మేలు జరుగుతుందన్నారు. పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. నాయకులు పెంట ఇంద్రుడు, మంద మహిపాల్, దేగాం గంగారెడ్డి, సాయరెడ్డి, బైండ్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణమ్మను విమర్శించే స్థాయి ప్రశాంత్‌రెడ్డికి లేదు



కమ్మర్‌పల్లి: ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మను విమర్శించే స్థాయి మంత్రి ప్రశాంత్‌రెడ్డికి లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన తల్లి అన్నపూర్ణపై మంత్రి వేముల చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తన తల్లిని గౌరవిస్తే తాను ఆయనను గౌరవిస్తానని వెల్లడించారు. నాయకులు కట్ట సంజీవ్, రెంజర్ల గంగారాం, చింత ప్రవీణ్, రెంజర్ల గంగాధర్, కొత్తపల్లి అరుణ్, కుంట భూమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి



ఆర్మూర్: పట్టణంలో వచ్చే నెల 3న నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచార సభకు అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీఎస్ఐఐసీ) చైర్మన్ ద్యాదరి బాలమల్లు, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కోరారు. ఆర్మూర్ శివారులో బహిరంగ సభ ఏర్పాట్లను శనివారం వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విజయం తప్పదని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

దొరల తెలంగాణను కోరుకోలేదు



చాకీర్యాల్‌లో మహిళలతో మాట్లాడుతున్న బీజేపీ బాల్కొండ అభ్యర్థి అన్నపూర్ణమ్మ

బాల్కొండ: దొరల తెలంగాణ ఏర్పాటు కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకోలేదని, సామాజిక తెలంగాణ రావాలని ఆకాంక్షించారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ బాల్కొండ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేసీఆర్‌కు దమ్ముంటే దళితున్ని ముఖ్యమంత్రి చేయాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే బీసీ నేతనే ముఖ్యమంత్రి చేస్తామని ప్రకటించిన దమ్మున్న పార్టీ బీజేపీ అన్నారు. పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను త్వరలోనే విడుదల చేస్తుందన్నారు. కేసీఆర్‌ను ప్రజలు ఎవరు నమ్మే స్థితిలో లేరన్నారు. అనంతరం మెండోరా మండలం దూదిగాం, చాకీర్యాల్ గ్రామాల్లో ఎన్నికల ప్రకచారం నిర్వహించారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి ప్రతి పనిలో 30 శాతం కమీషన్ తీసుకున్నారని ఆమె ఆరోపించారు. బాల్కొండ మండలం ఇత్వార్‌పేట్, బోదేపల్లి గ్రామాల నుంచి పలువురు యువకులు అన్నపూర్ణమ్మ సమక్షంలో బీజేపీలో చేరారు. అలాగే ఇత్వార్‌పేట్ కుచెందిన శ్రీకాంత్‌కు బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడిగా, మండల కేంద్రానికి చెందిన కన్నె నవీన్‌ను ప్రధాన కార్యదర్శిగా నియామిస్తూ వారికి నియామక పత్రాలను అందజేశారు. నాయకులు నిమ్మల శ్రీనివాస్, అంబటి నవీన్, పద్మ, మోహన్, సాయన్న, రాజేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి



బాల్కొండలో మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ: నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి, ఓటు వేయాలని బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ప్రశాంత్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందిస్తామన్నారు. బాల్కొండలో రూ. కోట్ల నిధులతో అభివృద్ధి చేశామన్నారు. అభివృద్ధి చేశా కాబట్టి మళ్లీ ఆశీర్వాదించాలని అడుగుతున్నానన్నారు. నాయకులు డాక్టర్ మధుశేఖర్, రాజేశ్వర్, ఎంపీపీ లావణ్య, జెడ్పీటీసీ దాసరి లావణ్య, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, బీఆర్‌శ్రీస్ పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

వేల్పూర్: మోర్తాడ్, మండలం శెట్‌పల్లి, భీమ్‌గల్ మండలం మెండోరా, భీమ్‌గల్ నుంచి బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం వేల్పూర్‌లో మంత్రి ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయాల మూసివేత



జంబిహనుమాన్ ఆలయాన్ని మూసివేస్తున్న ఆలయ సిబ్బంది

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పలు ఆలయాలు శనివారం సాయంత్రం మూసివేశారు. చంద్రగ్రహణం కారణంగా ఆలయాలను మూసి వేస్తున్నట్లు ఆలయ పూజరులు తెలిపారు. అర్ధారాత్రి ఒంటి గంట నుంచి 2:30 నిమిషాల వరకు చంద్రగ్రహణం ఏర్పడుతుందన్నారు. తిరిగి ఉదయం ఆలయాలను తెరుస్తామన్నారు.



జానకంపేటలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని మూసివేస్తున్న పురోహితులు

హనుమన్ ఆలయంలో అన్నదానం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జిరాయత్‌నగర్‌లోగల హనుమాన్ ఆలయంలో, జంబిహనుమాన్ ఆలయంలో శనివారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి పౌర్ణమి రోజు ఆలయాల్లో అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	లింగోచ్చా(తెలుగు) - 1.45, ఒక్కడే-1 (తెలుగు) - 4.45 మార్టిన్ లూథర్ కింగ్(తెలుగు) - 7.25 ఓటు (తెలుగు) - 10.30
స్క్రీన్-2 –	భగవంత్ కేసరి (తెలుగు) - 11.15, 2.40, 6.05, 9.30
స్క్రీన్-3 –	లియో (తెలుగు) - 11.55, 3.20, 6.45, 10.10
స్క్రీన్-4 –	మార్టిన్ లూథర్ కింగ్ (తెలుగు)-12.05, నాగేశ్వరరావు-3.10, 6.35, 10.00

ఆర్మూర్‌లో కంటివైద్య శిబిరం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో, మయూరి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్యుడు నరేష్‌కుమార్ కంటి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. రోటరి అధ్యక్షుడు పట్వారి గోపి, పట్వారి తులసి, గోనె దామోదర్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్ మండల కేంద్రాల మధ్య గల జాతీయ రహదారిపై ఎన్నికల మోడల్ కోడ్ అధికారులు శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సరైన పత్రాలు లేకుండా నగదు, బంగారు అభరణాలు, మద్యం తరలిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎంపీడీవో సంతోష్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.